# PITHAPUR RAJAH'S GOVERNMENT COLLEGE(A) KAKINADA

# BA SPECIAL TELUGU

# 3$^{RD}$ SEMESTER

# PAPER 8

# ADHUNIKA KAVAYAM

# శ్రీరంగం శ్రీనివాస రావు (శ్రీ శ్రీ)  (1910-1983).

ప్ర. 1. ఆధునిక యుగకవిగా శ్రీశ్రీని వర్ణించుము.

జ. ఆధునిక యుగమున తెలుగు సాహిత్య ప్రపంచమున 'శ్రీశ్రీ' అను సంక్షిప్త నామముతో విస్తృత ఖ్యాతిని ఆర్జించిన యుగకవి. ఆయన 1910, జనవరి 2న విశాఖపట్టణమున జన్మించెను. తండ్రి వెంకటరమణయ్య, తల్లి అప్పలకొండ. శ్రీశ్రీ పుట్టిన రెండేండ్ల లోపుననే తల్లి మరణించెను. తండ్రియగు వెంకటరమణయ్యయే, శ్రీశ్రీని తల్లిలేని లోటు కనబడకుండా పెంచి పెద్ద చేసెను.

విశాఖపట్టణములోని ఎ.వి.ఎస్ కాలేజిలోను, మద్రాసు నందలి క్రిస్టియన్ కాలేజిలోను శ్రీశ్రీ విద్యాభ్యాసం చేసెను. ఆ తరువాత వివిధ ప్రాంతాలలో ఎన్నో ఉద్యోగములను నిర్వహించి, కడకు 1950 ప్రాంతమున సినిమా రచయితగా, ఆయన మద్రాసులో స్థిరపడెను. 'నీరా ఔర్ నందా' అనే హిందీ చిత్రమును 'ఆహుతి' పేరుతో తెలుగులో డబ్ చేసెను. శ్రీశ్రీ మాటలు - పాటలు కూర్చిన మొదటి సినిమా కూడ ఇదియే. ఆ తరువాత ఆయన పెక్కు తెలుగు సినిమాలకు మాటలు పాటలు రచయితగ పనిచేసి ఆ రంగమునకు గణనీయతను ఆర్జించెను.

కాని శ్రీశ్రీకి అజరామర ఖ్యాతిని కల్పించింది అతని సాహిత్య కృషి, ఈ శతాబ్దపు కవితా ధోరణికి, కవితా శక్తికి ప్రతీకగ ఆయన నిలిచెను. తనకాలపు యుగవాణిని బలీయముగ వినిపించిన కవులలో అత్యంత శక్తివంతమగు గొంతుక ఆయనది.

రచనలు :

ఆయన రచించిన తొలి కావ్యములను 'ప్రభవ' అను పేర సంపుటిగ కవితా సమితి 1928లో ప్రచురించినది. 1946లో 'వారం వారం' అనే వచన రచనల సంకలనము అచ్చయినది. 1950లో 'మహా ప్రస్థానం' అనే పేరున శ్రీశ్రీ రచితములగు గీతాల సంపుటి మొదటిసారిగ అచ్చయినది. ఆయనకు గొప్ప పేరును తెచ్చినది ఈ గ్రంథమే. 1985 వరకు దాదాపు ఇరువది ముద్రణలను పొందినది ఆ గ్రంథము. 1956లో 'మరో ప్రపంచం' అనే రేడియో నాటికల సంపుటి, 1957లో 'చరమరాత్రి' (కథల సంపుటి) అచ్చయినవి. 1966లో ఫిబ్రవరిలో 'ఖడ్గ సృష్టి' పేరుతో 'మహాప్రస్థానం' తరువాతి గీతాలు అచ్చయినవి. దీనికి సోవియట్ లాండ్ నెహ్రూ అవార్డు లభించినది.

భావకవిగ కవిత్వమును ప్రారంభించిన శ్రీ శ్రీ, ఈ శతాబ్దపు ముప్పదులు ముగియు నాటికి అభ్యుదయ కవిగ పరిణమించెను. జీవితమున ఎన్ని ఒడిదుడుకులకు గురియైనను, చివరి వరకు పీడిత వర్గపు కవిగా తనను తాను గుర్తించుకొని వర్గరహిత సమాజ స్థాపనయే తన ఆదర్శముగ ఆయన కృషి చేసెను.

కవిత్వ శైలి :

తెలుగు సాహిత్యమున కొన్ని క్రొత్త ప్రక్రియలను శ్రీశ్రీ ప్రవేశపెట్టెను. అభ్యుదయ కవితాపథముతో పాటుగా అధివాస్తవిక కవిత్వములో కూడ కొన్ని ప్రయోగములను ఆయన చేసెను. 'ప్రాస క్రీడలు' అను పేరుతో కార్టూన్ కవిత్వమును ప్రవేశపెట్టెను. 'లిమ బుక్కులు" పేరుతో కేవల హాస్యధోరణి కవితలను అతని రచనలలో కలవు. 'చైతన్య స్రవంతి' పద్ధతిని కథలలో ప్రవేశపెట్టినది శ్రీశ్రీయే.

పెక్కుసాహిత్య సంఘాలతో, సాహిత్య ఉద్యమాలతో శ్రీశ్రీకి సజీవ సంబంధము కలదు. 1926లో వచ్చిన కవితా సమితిలోను, ఆ తరువాత వచ్చిన నవ్య సాహిత్య పరిషత్తులోను ఆయన సాధారణ సభ్యుడు. 1943 తరువాత అభ్యుదయ రచయితల సంఘమునకు అధ్యక్షుడు.

వ్యక్తిగతముగ శ్రీశ్రీ హాస్యప్రియుడని, అతని హాస్యోక్తులతో పరిచితి కలవారు అనెదరు, ఆయనలో పసివాని మనస్తత్వము వేద్యమయ్యెడిదని వారి కథనము. అమాయకత్వమును, ప్రగాఢతయు కలగలసిన మనస్తత్వము అతనిది.

'కష్టజీవి'కి ఎల్లపుడు అండగ నిలబడిన ఆ శ్రీశ్రీ 1983, జూన్ 15న మరణించెను.

....................

# <u>సమకాలీన అభ్యుదయ కవుల పరిచయం</u>

## <u>దాశరథి:</u>

ఆధునికాంధ్ర కవితాసారధి దాశరథి. పద్యాన్ని అభినివేశంతో పరవళ్లు తొక్కించిన చైతన్య సారధి దాశరథి.

"నేనురా తెలగారానిగళాల తెగ గొట్టి
ఆకాశమంత యెత్తార్చినాను
నేను రాక్షసి గుండె నీరుగా పద్యాలు
పాడి మానవుని కాపాడినాను
నేను వే స్తంభాల నీడలో నొక తెల్గు
తోటనాటి సుమాలు దూసినాను
నేను పోతన కవీశాసు గంటములోని
ఒరుపులు కొన్నింటి బడిసినాను
కోటి తమ్ముల కడ రెండుకోట్ల తెల్గు
టన్నలనుగూర్చి వృత్తాంతమంద జేసి
మూడు కోటుల నొక్కటే ముడిబిగించి
పాడినాను మహాంధ్ర సౌభాగ్య గీతి"

పద్యరచనలో ప్రతిభావంతుడైన మహాకవి దాశరథి. దేశ చరిత్రను ఇతివృత్తంగా తీసుకొని తెలుగు ప్రజల్లో చైతన్యం దీపింపజేసిన మహాకవి. తెలంగాణాలో సాహిత్య చైతన్య స్ఫూర్తిని కలిగించటం, తెలుగు పద్యరచనకు కొత్త ఒరవళ్ళు పెట్టడం,

తెలంగాణా బంధాలు భేదించటం, నవాబు రాక్షస పాలనకు చరమగీతం పాడించటం, మహాంధ్రోద్యయానికి మహోన్నతంగా కృషి సాగించటం దాశరథి జీవితంలోనూ, కవిత్వంలోనూ మహోజ్జ్వలంగా ప్రకాశించే ఘట్టాలు.

.............................

ప్ర. 2. దాశరథి కవితా వైశిష్టతని తెలుపుము.

దాశరథి కృష్ణమాచార్యులు వరంగల్లు జిల్లా గూడూరులో జూలై 22వ తేదీ, 1925వ సంవత్సరములో పండిత వంశంలో జన్మించారు. ఈ విషయాన్ని 'దాశరథి కవితా "సమాలోచన' సిద్ధాంత గ్రంథంలో డా॥ ఎలపర్తి చంద్రమౌళిని నిర్ధారించారు. (విమర్శకులంతా సెప్టెంబర్ 1927 దాశరథి జన్మించిన సంవత్సరంగా భావిస్తున్నారు). ఆయన తల్లిదండ్రులు వెంకటమ్మ, తండ్రి వెంకటాచార్యులు సంస్కృతాంధ్ర ద్రావిడ భాషల్లో పండితులు. సంప్రదాయజ్ఞులు వర్ణాశ్రమ ధర్మాలను నిష్టా గరిష్టంగా పాటించేవారు. దాశరథి ప్రాథమిక విద్య తండ్రి సమక్షంలోనే సాగింది. ఆయన తెలుగు కన్నా సంస్కృత బోధనకే ప్రాధాన్యమిచ్చారు. ఆ ప్రభావంతో చిన్నారి పొన్నారి చిరుత కూకటి నాడే దాశరథి కవిత్వ రచనకు పూనుకొన్నారు. ఖమ్మంలో గుంటిమల్లన వీధిలోని ఉన్నత పాఠశాలలో కేశవార్యశాస్త్రి దగ్గర చదువుకొన్నారు. పాఠశాల విద్యార్థిగా పదేళ్ల ప్రాయంలోనే ఆయన హృదయంలో వింత త్రేతాగ్నులు ప్రజ్వరిల్లాయి. దాశరథి మాటల్లో ఆయన గురువు కేశవార్యశాస్త్రి వ్యాఖ్యానించిన ఉపనిషద్వాక్యాలూ, జనాబ్ జక్కీ సాహెబ్ వినిపించిన ఇక్బాల్ విప్లవగీతాలు, చుట్టాలమ్మాయి చూడామణి చూపులోని వెచ్చదనాలూ "తన జీవితాన్ని కవితాయజ్ఞంగా తీర్చిదిద్దాయి.

ఉపనిషద్వాక్యాల్లో, ఇక్బాల్ విప్లవగీతాల్లోని అగ్ని చూడామణి చూపుల్లోని వెచ్చదనం అడపా తడపా నామీద దాడిచేసి నన్ను లొంగదీశాయి. ఆనాడే అంగారం, శృంగారం నన్ను ఆవహించాయి. నేను ఆ విద్వాంసులిద్దరికీ దూరమైనా, నా చూడామణి దక్కకపోయినా, ఆనాడు వారి వలన నాలో ప్రవేశించిన అగ్ని రమారమి నలభై ఏళ్లుగా నన్ను వెంటాడుతున్నది" అని చెప్పిన మాటలు ఆయన కవితావేశ దీప్తికి, విప్లవస్ఫూర్తికి ఎంతగా దోహదం చేశాయో స్పష్టమవుతుంది.

ఖమ్మం ఉస్మానియా హైస్కూల్లో మెట్రిక్యులేషన్ వరకు చదివారు. ఆయన సహాధ్యాయులుగా డి. రామలింగం, ఎం.యల్.నరసింహారావు వంటి సాహితీ ప్రియులుండేవారు. పాఠశాల దశలోనే దాశరథి కృష్ణమాచార్యులు దాశరథిగా మారాడు.అప్పటి నిజాం నవాబు దురాగతాలలో 1943 ప్రాంతంలో 'గార్ల' జాగీరులో రైతుల అలజడి ప్రారంభమైంది. రైతుల దుస్థితిని చూచి చలించిపోయాడు. నిజాం నవాబును నిరసిస్తూ మానిజాము రాజు, జన్మజన్మాల బూజు" అన్నారు. తన కన్నతల్లి కన్న మిన్నగా భావించే జన్మభూమి తెలంగాణాను ప్రశంసిస్తూ "నాతెలంగాణ కోటిరత్నాల వీణ"గా పేర్కొన్నారు. దాశరథి కవితా సూక్తులు తెలంగాణా ప్రజల నాలుకలపై నాట్యం చేశాయి. నిజాం నవాబు గుండెల్లో గునపాలుగా గుచ్చుకొన్నాయి. ఆయన మాటలు ఈటెలుగా, కవితాసూక్తులు చురకత్తులుగా నిజాం ప్రభుత్వానికి దడపుట్టించాయి.

దాశరథి నిజాం నవాబు వ్యతిరేకోద్యమంలో ముమ్మరంగా పాల్గొన్నారు. ఆవేశపూరితమైన ఉపన్యాసాలతో ప్రజల్లో చైతన్యాన్ని రేకెత్తించారు. 1946 డిసెంబరు 18వ తేదీన మానుకోట తాలూకాలో ఒక గ్రామంలో వీరావేశంతో తెలంగాణము రైతుదే. ముసలినక్కకు రాచరికము దక్కునే" అని అగ్నిధారలు కురిపించారు. ఆ

స్థితిలో దాశరథిని పోలీసులు అరెస్ట్ చేశారు. అక్కడ నుండి 20మైళ్లు నడిపించి, మండుటెండల్లో పురవీధుల్లో ఈడ్చుకొని 'వల్లికుదురు తానా'కు తీసుకెళ్లారు. చుట్టూ పోలీసులు కాపలా ఉన్నా తప్పించుకొని పరుగెత్తాడు. రజాకార్ల లాఠీ దెబ్బలతో క్షతగాత్రుడైన దాశరథి క్షుభిత కల్లోల హృదయం నుండి అగ్నిధారలు కురిపించాడు. విప్లవ విస్ఫులింగాలతో రుద్రవీణను మీటాడు. ఆయన కవితా జీవితానికి గొప్ప ప్రేరణ కలిగింది.

నవాబుకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన సత్యాగ్రహంలో పాల్గొని అరెస్టయ్యాడు. దాదాపు పదహారు నెలల జైలు జీవితంలో కొరడా దెబ్బలు తిన్నారు. జైలు గోడలపై బొగ్గుతో నవాబు దారుణాలను నిరసిస్తూ

"ఓ నిజాము పిశాచమా! కానరాడు నిన్ను బోలిన రాజు మా కెన్నోడేని తీగెలను తెంపి అగ్నిలో దింపినావు నా తెలంగాణ కోటిరత్నాల వీణ" అగ్నిధార

ఆ పద్యం చదివిన అధికార్లు అదిరిపడ్డారు. వాళ్లు ఎన్నిసార్లు చెరిపినా అన్నిసార్లు జైలు గోడలపై దాశరథితో పాటు జైలు జీవితం గడిపే వట్టికోట ఆళ్వారు స్వామి రాసేవాడట. 1948 సెప్టెంబర్ 11వతేదీన దాశరథిని జైలు అధికార్లు దారుణాతి దారుణంగా చిత్రవథలు పెట్టారు. అస్వస్థతకు గురైన దాశరథి అదృష్టవశాత్తు బ్రతికి బయటపడ్డాడు.'"

ఇతర రాజకీయ ఖైదీలతో పాటు ఆయనకు 1948 సెప్టెంబర్ 18వ తేదీన విముక్తి లభించింది. జైలు జీవితం గడిపిన చీకటి రోజుల్లో కవితాకరవాలంతో పోరాటం సాగించారు. కవితా దీప్తులతో ప్రకాశించారు.

ఉద్యోగ జీవితం :

: జైలు నుండి విడుదలైన తరువాత దాశరథికి 1950లో

జ్ఞడి స్తూ వించే క్తులు రు.

వివాహమైంది. కొంతకాలం స్థానిక స్వపరిపాలన శాఖలో ఉద్యోగిగా పనిచేశాడు. గ్రామం పంచాయితీలను తనిఖీ చేయడం ఉద్యోగవిధి. ఉద్యోగవిధి నిర్వహిస్తూనే స్వయంకృషితో బి.ఏ. ఆంగ్ల సాహిత్యంలో ప్రధానాంశంగా ఉత్తీర్ణుడయ్యాడు. ఉద్యోగరీత్యా తెలంగాణా పల్లె ప్రాంతాలెన్నో సందర్శించాడు. 1956లో ఆకాశవాణిలో 'ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్'గా చేరాడు. 1961 నుండి సినీరంగ ప్రవేశం చేసి తెలుగు ప్రేక్షకులను రంజింపజేసే రెండువేల పాటలను రచించి సినీరంగంలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకొన్నాడు. సినీగీతాల రచనతో పాటు ఆకాశవాణి ఉద్యోగాన్ని 1971 వరకు కొనసాగించారు. ఉద్యోగ కాలంలోనే రచనా వ్యాసంగం విరివిగా సాగింది. 1977 ఆగష్టు 15వ తేదీన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాశరథిని ప్రభుత్వ ఆస్థానకవిగా నియమించి సముచిత గౌరవాన్ని ఆయన కవితా ప్రతిభకు కల్పించింది.

దాశరథి రచనలు - ప్రేరణలు - ప్రభావాలు :

విద్యార్థి దశలోనే కేశవార్యశాస్త్రి ఉపనిషత్ వ్యాఖ్యానాలూ, ఉర్దూ మాస్టారు జక్కీ సాహెబ్ విమర్శనాత్మకంగా వివరించిన గాలిబ్ కవితా మాధుర్యం, తన తండ్రి దగ్గర నేర్చుకొన్న సంస్కృత భాషా పరిజ్ఞానం దాశరథిని ఎంతగానో ప్రభావితం చేశాయి. ఆంగ్లకవులైన షెల్లీ, కీట్సు, కోల్రెడ్జ్, వర్డ్సువర్తు రచనలను శ్రద్ధతో అధ్యయనం చేసి ఆంగ్లభాషా పరిజ్ఞానాన్ని పెంపొందించుకొన్నారు.

రవీంద్రుని గీతాంజలి, క్రిసెంట్మూన్, ఫ్రూట్ గేదరింగ్ వంటి కవితలు, కింగ్ ఆఫ్ డార్క్ చాంబర్, రెడ్ ఏలియాండర్స్ వంటి నాటికలు, కాబూలివాలా వంటి కథలు అరవిందుని సావిత్రి, ప్రేమచంద్ ఉర్దూ కథలు, నవలల ప్రభావం అపరిమితంగా ఉంది.

నజ్రుల్ ఇస్లాం "బద్రోహి" వంటి విప్లవగీతాలు, బంకింబాబు 'ఆనందమఠ్' వంటి నవలలు, డాక్టర్ ఇక్బాల్ 'మాలెజిబ్రైప్ 'జావిద్నామా' వంటి కావ్యాలు, పార్సీలోని దీవా నెహపిజ్ కవితా సంపుటి ఉమర్ ఖయ్యూమ్ రుబాయితీలు, మొహర్షీల్రఫా వంటి అరబ్బు కవుల రచనల ప్రభావంతో ప్రేరణతో దాశరథి కవితా చైతన్యం ప్రదీప్తమైంది.

రచనలు :

1. అగ్నిధార (1949), 2. రుద్రవీణ (1950), 3. మహాంధ్రోదయం(1956), 4. పునర్నవం (గేయ, వచన కవితల సంపుటి) (1956), 5. బుద్ధజయంతి (1957) 6. మహా బోధి (1959), 7. నవమి (1959) (తొమ్మిది రేడియో నాటికల సంపుటి),8.నవమంజరి (1959), ( ప్రణయ లలిత గీతాల సంపుటి) 9.అమృతాభిషేకం (1960), (నవ్యతాప్రీతితో రచించిన అద్భుత పద్యకావ్యం), 10. గాలిబ్ గీతాలు (అనువాద గ్రంథం)(1961), 11. దాశరథి శతకం (1962), 12. కవిత పుష్పకం (1966) (సామయిక కవితలు, ప్రణయ భావాలు, అనువాదాలున్న సంపుటి),13. తిమిరంతో సమరం (1973) (యుద్ధ విముఖత శాంతి కాముకత ప్రధానంగా గల వచన కవితా సంపుటి), 14.ఆలోచనాలోచనాలు (1975) (వచన కవితా సంపుటి), 15. ధ్వజమెత్తిన ప్రజ (1981) (శాంతిప్రియత్వం, యుద్ధవిముఖత, మానవత, ఆశావాదాలతో కూడిన (వచన కవితా సంపుటి).

అవార్డులు-బిరుదులు :

దాశరథి రచనల్లో కొన్నింటికి అవార్డులు లభించాయి.

1965లో గాలిబ్ గీతాలకు ఉత్తమ అనువాద గ్రంథంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ బహుమతి లభించింది. 1967లో 'కవితా పుష్పకం' గ్రంథానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య

అకాడమీ ఉత్తమ కవితా సంపుటిగా గుర్తించి దాశరథిని తాళపత్రంతో సత్కరించింది. తిమిరంతో సమరం కవితా సంపుటికి 1974తో 48వ స్నాతకోత్సవ సందర్భంగా దాశరథి సాహిత్య సేవకు గుర్తింపు 'కళాప్రపూర్ణ' బిరుదుతో సత్కరించింది. ఆగ్రా విశ్వవిద్యాలయం 1976లో 'డి.లిట్టో' గౌరవించి సత్కరించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1977 ఆగష్టు 15వ తేదీన దాశరథిని ఆస్థానకవిగా నియమించడం ఆయన కవితా ప్రతిభకు సముచిత సత్కారం. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం 1981లో 'డి.లిట్'తో సత్కరించింది.

ఆంధ్రప్రదేశ్ సాహిత్యం అకాడమీ కార్యనిర్వాహక సంఘ సభ్యులుగా, కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు విభాగ సలహా సంఘ సభ్యులుగా, ఆంధ్ర సారస్వత పరిషత్ కార్యనిర్వాహక సంఘ సభ్యులుగా, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘ సభ్యులుగా, జాతీయ రచయితల సంఘం దక్షిణ మండల కార్యదర్శిగా గణనీయమైన సేవలు చేశారు. ఆ పదవులకు వన్నె తెచ్చారు. అంతర్జాతీయ తెలుగు సంస్థ మలేషియా ఆంధ్ర సంఘం ఆహ్వానం మేరకు 1976లో మలేషియాను సందర్శించారు.

స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, సాంఘిక న్యాయం, ఆర్థిక సమానత్వం, శాంతి సౌభ్రాతృత్వాలు దాశరథి రక్తంలో జీర్ణించుకొన్నాయి. మతదురహంకారం, వర్ణభేదాలు, పెట్టుబడిదారీ విధానం, యుద్ధకాంక్ష మొదలైనవి ఆయన నిరసించే విషయాలు. ఆయన కవిత్వంలో ప్రకృతి ప్రీతి, దేశాభిమాన ప్రబోధం, సమైక్యతా భావప్రీతి, యుద్ధ విముఖత, శాంతికాముకత. వీరగాథా చిత్రణ సమసమాజ స్థాపనా లక్ష్యం ప్రస్ఫుటంగా సాక్షాత్కరిస్తున్నాయి. పద్యాన్ని ఎంత హృద్యంగా రచించగలడో, గేయాన్ని, వచన కవిత్వాన్ని కూడ అంత గొప్పగా శైలీ సౌందర్యంతో రాయగలిగిన సవ్యసాచి. అందుకే ఆధునికాంధ్ర కవిత్వంలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకొన్నాడు.

.................................

ప్ర. 3. "తెలంగాణా ఉద్యమ వీరునిగా దాశరథిని వర్ణించుము.

ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం, దాశరథి కవితా స్వరూపాన్ని వివరిస్తూ "నిజాం నిరంకుశ పాలనలో ప్రజల బాధ హృదయ విదారకంగా వినపడుతోంది. సామాన్యుల రక్తం పిండి సామ్రాజ్యాన్ని నిర్మించుకొంటున్న కసాయి ప్రభుత్వం చేసే అరాచకకృత్యాలకుకొన్ని చోట్ల లయబద్ధంగానూ, మరికొన్నిచోట్ల నిక్కచ్చిగానూ ఉండేటట్లు రచించారు. నిరుపేద, శ్రామికజాతి, అనంతసంగ్రామం, పదేపదే అనేస్తా మొదలైన కావ్య ఖండికల్ని వచనకవిత్వంలోనే రాశారు.

'రూపాయికి విలువలేని రోజు రేపు వస్తుందట
మస్తిష్కంలో లేబోరేటరీ,
మేల్కొన్న మనిషిని
చూడ్డానికి వెళుతున్నాను
రేపటి జలపాతాలు
కంటికి కనిపించిందంతా కైతగా రాసేస్తున్నాను'

మొదలైన ఖండకావ్యాల్లో దాశరథి వచనకవిత్వం అభ్యుదయ భావాలతో శక్తిమంతంగా సాగింది. ఉర్దూ, పర్షియస్ భాషల్లో నిష్ణాతుడైన దాశరథి 'గజల్' వంటి ప్రక్రియల్లోవలె క్లుప్తంగా 'కప్లెట్ల' వంటి వచన గీతాలను వెలయించి ఆధునిక కవితకు పుష్టిని చేకూర్చారు.

.............................

ప్ర. 4. శిష్ట్ల ఉమామహేశ్వరరావు కవిని గూర్చి తెలుపుము.

ఉమామహేశ్వరరావు శిష్టా (1912-1953):

అతినవ్య తెలుగుకవి, బహుముఖమైన అనుభవముతో తెలుగు కవిత్వమును విచిత్రమైన క్రొత్త పుంతలలో మళ్ళింపవలెనని ప్రయత్నించి, తాను రేకెత్తించిన ఆశలు తీర్చకుండగనే అకాల మరణము పాలైన ప్రతిభావంతుడైన కవి.

గుంటూరు జిల్లాలోని 'మంచాళ' అగ్రహారమునకు చెందిన ఒక శిష్ట వైదిక బ్రాహ్మణ కుటుంబములో 1912లో ఉమామహేశ్వరరావు జన్మించెను. బాల్యములో పురాణ గాథలను జానపద సాహిత్యమును జీర్ణించుకొనెను. ఆంగ్ల సాహిత్యములో ఎం.ఏ.పట్టము పొంది ఇంగ్లీషులోని నూతన కవితా ప్రస్థానములనన్నిటిని బాగుగా ఆకళింపు చేసికొనెను. కొన్నాళ్ళు దివ్యజ్ఞాన సమాజములో ఉండెను. కొన్నాళ్ళు ఒక యతివద్ద శుశ్రూష చేసెను. జ్యోతిషము అభ్యసించెను. ఆధ్యాత్మ రామాయణ కీర్తనలన్నను, వాగ్గేయకారుల కృతులన్నను ఆయనకు అమిత ప్రీతి.లయలో, ఛందస్సులలో, పద ప్రయోగములో తెలుగు కవితలో నూతన ప్రయోగములు చేయుచు 'విష్ణు ధనువు', 'నవమి చిలుక' అను రెండు ఖండ కావ్య సంపుటులను ప్రకటించి నాటి తెలుగు కవితా జగత్తును ఉమామహేశ్వరరావు దిగ్భ్రాంత పరచెను, అచ్చు వేయుటలోను, అచ్చువేయు కాపీల సంఖ్యలోను కూడ నవ్యతను ప్రదర్శించెను. తొలుత ఒక కళాశాలలోను తరువాత కొంతకాలము ఒక ఫరమ్లోను ఆయన పని చేసెను. తరువాత సైన్యములో చేరి చిత్ర చిత్రములైన అనుభవములను పొందెను. సిపాయి కథలు'అను మౌలికములైన కథలలో ఆ అనుభవములను ఆయన ప్రకటించెను. భావ కవిత్వము మొదలు అధివాస్తవిక కవిత వరకు వివిధ కవితా మార్గములలో తన విశిష్ట ముద్రను ఆయన ప్రదర్శించెను. తన కావ్యములలో

తాను ప్రకటించిన ప్రేమను 'ఉద్రాంత ప్రేమ' అని అతడు పేర్కొనెను. అతని 'కాళింగి పాటలు' తెలుగు కవిత్వానికి నూతనాలంకారములు. 'గోరింట రాక్షసుడు' మొదలైన పిల్లల కథలను, ఇతర వ్యాసములను ఎన్నింటినో ఉమామహేశ్వరరావు వివిధ పత్రికలలో, 'మహేశ్వర', వినాయక పండితుడు, 'ఉమా', 'విజయ మహేశ్వరం' వంటి పలు కలము పేర్లతో ప్రకటించెను. కొద్దికాలము గుంటూరు నుంచి వెలువడుచుండిన 'కాంతిని' అను పత్రికకు సంపాదకుడుగా పని చేసెను.

"కవి, గొప్ప ప్రతిభావంతుడు ..... మనస్సులో జరుగు కొన్ని వికారములను, ఉన్మేషములను ఇంత చక్కగా ఆరోపించి చెప్పుట మిక్కిలి కష్టమైన పని...." అని విశ్వనాథ చేతను, "ఇతనిది శ్రీశ్రీ, నారాయణబాబు ఇత్యాదుల వలె ఎక్కడ నుంచో వచ్చిన కవిత్వము కాదు. తెలుగు గడ్డలో పుట్టి తెలుగు జీవితముతో పెరిగిన నవ్య కవిత్వమిది" అని నోరి నరసింహశాస్త్రి చేతను అతని కవిత ప్రశంసలందెను.

.........................

ప్ర. 5. అభ్యుదయ కవిగా అనిసెట్టిని పోల్చుము.

అనిసెట్టి :

"అభ్యుదయ కవిత్వం" అనేమాట చెలామణిలోనికి రాని రోజుల నుంచీ అనిసెట్టి ప్రగతివాద దృక్పథంతో కవితలు రాసేవారు. అనిసెట్టి పుట్టింది ఆగర్భశ్రీమంతుల ఇంట్లోనేగాని అతడు తనచుట్టూ ఉన్న ఆగర్భదరిద్రుల ఆర్తనాదాలనే విన్నారు. బిచ్చగాళ్ల దీనాలాపనలను ఆలకించారు. 1942 ప్రాంతంలో అతినవ్య కవిత్వం ప్రారంభించి అన్ని మజిలీలు పయనించి మారిజాన్ని చేరుకున్న మరొక అభ్యుదయకవి అనిసెట్టి సుబ్బారావు అని ఆరుద్ర అంటే "అభ్యుదయ కవుల్లో అనిసెట్టి పేరుగా కన్పిస్తారు. అభ్యుదయ కవిత్వం ఆవేశ ప్రధానమైంది. కానీ అనిసెట్టి

కవిత్వం అనుభూతి ప్రధానంగా ఉండేది. అభ్యుదయ కవిత్వపు కూర్పు ఘాటుగా ఉంటుంది. కాని అనిసెట్టి కూర్పు సున్నితంగా ఉండేది. ఇతను నిజంగా అభ్యుదయకవేనా ? అనిపించేంత భావసౌకుమార్యం అతని కవిత్వంలో కనిపించేది" అని చేకూరి రామారావు అన్నారు.

అనిసెట్టి సుబ్బారావు రచించిన 'అగ్నివీణ' అభ్యుదయ కవిత్వంలో ముఖ్యమైనది. 'ఎవరిపిల్లలో మీరు' బిచ్చగాడి పాట, మొదలైన గేయాల్లో వీరి భావతీవ్రత, ధారాశుద్ధి ప్రస్ఫుటమౌతాయి.

"భయం భయం బ్రతుకు భయం...
అన్నా మనకీలోకం పన్నిన పద్మవ్యూహం
ఆశలతో బ్రతుకీడ్చే అస్థిపంజరాలు మనం
ఆవేదన హితమయ్యే ఆశాజీవులం మనం
గతమంటే కారువెగటు, రేపంటే తగని భయం"

అని సామాన్యుని దుర్భర జీవితాన్ని, నిస్సహాయ స్థితిని రమణీయంగా వర్ణించారు. 'ఈ లోకపు శాసనాలు ఎంగిలాకులిస్తాయి' అని పరిస్థితులు బాలలను బిచ్చగాళ్లుగా, నేరస్థులుగా చేయటాన్ని గురించి ఆక్రోశించారు. వీరి గేయాలు ప్రజల్ని కర్తవ్యోన్ముఖుల్ని చేసే భావాలతో నిండి ఉంటాయి అనిసెట్టిగారు అభ్యుదయోద్యమం బలహీనపడిన తర్వాత సినిమారంగంలో స్థిరపడ్డారు.

.........................

ప్ర. 6, కవి తిక్కవరపు పట్టాభి రామిరెడ్డి కవితా ప్రస్థానాన్ని వివరించండి.

పఠాభి :

పఠాభి కలం పేరుతో కవిగా ప్రసిద్ధుడైన తిక్కవరపు పట్టాభిరామిరెడ్డి ఆగర్భ శ్రీమంతుడు. నెల్లూరుజిల్లాలో తొలి బ్యాంకర్లుగా ప్రసిద్ధి పొందిన ఇద్దరు వ్యక్తుల్లో పఠాభి తండ్రి తిక్కవరపు రామిరెడ్డి ఒకరు. ఆయనకు మైకా పరిశ్రమలోను అదృష్టం కలిసివచ్చింది. రామిరెడ్డిది నెల్లూరుకు సమీపంలోని పొట్టేపాళెం. తరతరాలుగా వ్యవసాయ కుటుంబం. పఠాభి తాత తిక్కవరపు లక్ష్మీనారాయణరెడ్డి.

పఠాభి తల్లి సుదర్శనమ్మ గొప్ప సాహిత్య వారసత్వం కలిగిన కుటుంబం నుంచి వచ్చింది. ఆమె తండ్రి బెజవాడ పట్టాభిరామరెడ్డిది నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెం. ఆయన విద్యావంతుడు, కవిపండిత పోషకుడు. బుచ్చిరెడ్డిపాళెం నుంచి శ్రీవర్తమాన తరంగిణి, శారద పత్రికలు మిత్రులతో కలిసి వెలువరించాడు.

పఠాభి తండ్రి రామిరెడ్డి కూడా కవిపండిత పోషకుడుగా ప్రసిద్ధి పొందాడు. ఆయనకు ఆంధ్రమహాభారతం అంటే మహాప్రీతి. జీవితాంతం ఎవరో ఒక పండితుడు మహాభారతం చదివి వినిపించేవాడు. రామిరెడ్డి విద్యావైద్య రంగాలను ప్రోత్సహిస్తూ ఎన్నో ధర్మకార్యాలు చేశాడు.

పఠాభికి ఒక అక్క శ్యామలాదేవి. లక్ష్మీకాంతమ్మ, అనసూయమ్మ. శకుంతలమ్మ ముగ్గురు చెల్లెళ్లు. వీరందరికన్నా కడగొట్టు శివకుమార్ రెడ్డి. పఠాభి చిన్నాయన వెంకట్రామరెడ్డి అక్క శ్యామలాదేవి, చెల్లెలు లక్ష్మీకాంతమ్మ అందరూ కొంతకాలం శాంతినికేతన్లో చదువుకొన్నవారే. శ్యామలాదేవి చిన్నాన్న మీద 'దీప్తతార' స్మృతికావ్యం రాశారు. చెల్లెల లక్ష్మీకాంతమ్మ 'ఆనందమయి' పేరుతో సంస్కృతంలో కొన్ని శ్లోకాలు రాశారు. పఠాభి తమ్ముడు శివకుమార్రెడ్డి అమెచ్యూర్ ఫొటోగ్రాఫర్గా పేరు తెచ్చుకొన్నాడు.

పఠాభి తండ్రి రామిరెడ్డి నెల్లూరు టౌన్ చివర, చెరువుకు కూతవేటు దూరంలో విశాలమైన ప్రాంగణంలో 'సుదర్శనమహల్' బంగళా నిర్మించాడు. 1921లో తన మూడో ఏట గాంధీజీ సుదర్శనమహల్కు వచ్చారని, అప్పుడు ఆ భవనానికి గాంధీజీ శాంతినికేతన్అని పేరు పెట్టినట్లు పఠాభి రాశాడు. గాంధీజీ స్వయంగా ఒక అరటిపండు తనకు ఇచ్చినట్లు పఠాభి పేర్కొన్నాడు. గాంధీజీ ప్రభావంతో రామిరెడ్డి కుటుంబసభ్యులు శాకాహారులుగా మారారు. రామిరెడ్డి జాతీయోద్యమంలో జైలుశిక్ష అనుభవించారు. సుదర్శనమ్మ ఇతర ఉద్యమకారిణులతో కలిసి నెల్లూరు నగర వీధులన్నీ తిరిగి ఖద్దరు బట్టలు విక్రయించింది.

పఠాభి సుకుమార హృదయుడు. పువ్వులు, ఆకులు తెంపడం, క్రిమికీటకాలకు బాధ కలిగించడం కూడా సహించలేని ప్రవృత్తి. తండ్రి కోపిష్టివాడని, మాటకరుకని పేరు పడ్డాడు. తండ్రి మీద అయిష్టం. తల్లిచాటు బిడ్డగా పెరిగాడు. చిన్నాయన వెంకట్రామరెడ్డి వద్ద తనకు చనువు. ఆయన వద్దే బాల్యంలో చదువుకొన్నాడు.

పఠాభి ప్రాథమిక విద్య నెల్లూరు మూలాపేటలోని పాఠశాలలో సాగింది. చిన్నప్పటి నుంచి పదాలతో ఆట... తనకు వినోదం. గది కిటికీలో కూర్చొని దూరంగా కనిపించే చింతమాన్ను చూస్తూ చింతా!... చింతా! అంతా! యంతా! కొంతా! ముంతా! తంతా! అని పదాలతో ఆట సరదా!

మలబారు, చీమలబారు
ఇంజనీరు, గంజినీరు
ఇటట్లా శబ్దాలంకారాలకు సమ్మోహనం
అయ్యేవాడు.

నెల్లూరులో వి.ఆర్.హైస్కూల్లో చదువుతూ, స్కూలు పక్కన టౌన్హాలు ఆవరణలోని వర్ధమాన సమాజం గ్రంథాలయం మెట్లమీద కూర్చొని ఎన్నో పుస్తకాలు చదివినట్లు పఠాభి రాసుకున్నాడు. కౌమారదశలోనే పోతన, ప్రబంధకవులు, భట్టుమూర్తి, చేమకూర వెంకటకవి పద్యాలంటే తనకు మోజు. భారతమన్నా, షేక్ స్పియర్ అన్నా విముఖత, కళాపూర్ణోదయంలో దేశీఛందస్సు రగడ పాదం
"ఓ హంసి నీచేత నున్నయది నాబ్రదుకు

నా హృదయ మింతిదెందము నేకముగ నదుకు"
ఎప్పుడూ తన రసనమనీద ఆడుతూండేది. చిన్నప్పుడే అంత్యప్రాసల మీద శబ్దాలంకారాల మీద విపరీతమైన ఇష్టం ఏర్పడింది.
మేనమామ బెజవాడ గోపాలరెడ్డి ద్వారా పఠాభికి టాగోరు సాహిత్యంలో ప్రవేశం కలిగింది. జాతీయోద్యమ స్ఫూర్తివల్ల అందరిలాగే పఠాభి కూడా హిందీ నేర్చుకొన్నాడు. 13-14 సంవత్సరాల వయసులోనే కథలు, కవితలు రాయడం ఆరంభించారు. తొలి రచనలు జమీన్ రైతు వారపత్రిక, కృష్ణాపత్రికల్లో ప్రచురణ అయినట్లు పేర్కొన్నాడు. పఠాభి తొలికథ 'ప్రతిధ్వనులు' 1934 చిత్రగుప్తలో అచ్చయినట్లు తెలిసింది. ఈ కథ రాసేనాటికి పఠాభికి పట్టుమని పదిహేనేళ్లు కూడా లేవు. భిన్న మతాలకు చెందిన యువతీ యువకులవివాహానికి మతం అడ్డువస్తుంది. ఆ ప్రేమికులు ఎవరిమత విశ్వాసాలను వారు కొనసాగిస్తూ దంపతులుగా జీవించడానికి మతం అడ్డుకాదని భావిస్తారు. ఈ కథ భవిష్యవాణిగా పఠాభి కలంనుంచి వచ్చినట్లుంది.

పఠాభి కథలన్నీ 1935-40 మధ్య వివిధ పత్రికల్లో ప్రచురించబడినవే. చిత్రగుప్తలో అచ్చయిన మూడుతలల తాటిచెట్లు అంతకుముందే 'మునియోగి' పేరుతో జమీస్ రైతులో అచ్చయింది. ఈ కథ పాదరక్షలు, రమణ సాహసం చిన్నవయసులోనే పఠాభి ప్రదర్శించిన కథాశిల్పానికి నిదర్శనాలు. రెండు పదుల వయసు నిండకముందే పఠాభి 'నాగార్జున' 'విచిత్రవీర్యుడు' ఏకాంకికలు రచించాడు. నాగార్జునుడు బౌద్ధసన్యాసి, మధుశ్రీ మధుపమ్మే యువతి, స్త్రీ పురుషుల భౌతిక సంయోగమే మోక్షమని ఈ రూపకంలో ప్రతిపాదిస్తాడు. 'విచిత్రవీర్యుడు' అచ్చం జానపదగాథ.

పఠాభి మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో ఇంటర్మీడియేట్లో చేరాడు. తోడుగా తల్లి వెంటవెళ్ళి మద్రాసులో కాపురం పెట్టింది. కళాశాలకు దగ్గరగా ట్రిప్లికేన్లో నివాసం, ఇంటర్ అయ్యాక 1937లో పఠాభి శాంతినికేతన కు వెళ్లాడు. విద్యార్థి ప్రతినిధిగా టాగోర్కు సన్నిహితంగా మెలిగే అవకాశం లభించింది. శాంతినికేతస్ లో ఉండగానే తల్లి హృద్రోగంతో మరణించినట్లు వార్త అందింది.

స్వేచ్ఛా వాతావరణంలో పఠాభి కవిత పల్లవించింది. గురుదేవుని వలె శబ్దాలంకారాలను, అంత్యప్రాసలను వాడుతూ పఠాభి కవితలు రాశాడు. ఇదంతా భావకవిత్వమే. కమ్ముకొస్తున్న యుద్ధమేఘాల మీద, జాతీయోద్యమం మీద, కమల్పాషా మీద కూడా గీతాలు రాశాడు. రష్యస్ కవి నెక్రసోప్ ఉప్పుపాటను అనువదించాడు. రైతుబిడ్డమీద రాశాడు. పఠాభి చెప్పినట్లు ఈ కవితల్లో శ్రీశ్రీ ప్రభావం ఉంది.

...............